క్లుప్తంగా

కాంస్యం సాధించిన పీఈటీ



కాంస్య పథకంతో పీఈటీ రాజేందర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న పీఈటీ ఇప్ప రాజేందర్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయిలో కాంస్య పథకం సాధించినట్లు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2023 – 24 పోటీలు జరగగా 40ఏళ్ల వయసు విభాగంలో జరిగిన 200మీటర్ల పరుగు పందెంలో వెల్మకన్న పీఈటీ ఇప్ప రాజేందర్ కాంస్య పథకం సాధించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ రాష్ట్ర సభ్యుడు రామస్వామి మెడల్, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఈటీని పలువురు అభినందించారు.

తపస్ ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ఎంపీడీఓ కార్యాలయం వద్ద తపస్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాసుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల కోసం నిరంతర పోరాటం చేసేది తపస్ సంఘం ఒక్కటేనని పేర్కొన్నారు. జాతీయ భావాలు కలిగిన తపస్ సంఘం విద్యార్థులను దేశ భక్తులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు చక్రధర్, సురేందర్, మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్, రేఖ, కార్యవర్గ సభ్యులు అమరేశ్వరీ, అంజనేయులు, యాదగిరి, సుమతి, రమేశ్, నరేందర్ తదితరులు ఉన్నారు.

న్యూఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి

అల్లాదుర్గం(మెదక్): న్యూఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 31 వేడుకల్లో ఎవరైనా తాగి, హద్దు మీరి ప్రవర్తించినా.. స్కూల్‌లో, రోడ్లపై, ప్రభుత్వ కార్యాలయాల్లో తాగినా శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి వేళల్లో డ్రంకెన్ డ్రైవ్ చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. యువత జాగ్రత్తగా మలచుకోవాలి పెద్ద మొత్తంలో సౌండ్ సిస్టంలో పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరుస్తామన్నారు.

వాట్సాప్‌లో వాయిస్ మెసేజ్ పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

హవేళీఘణాపూర్(మెదక్): సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌లు గుండాలు అంటూ కాంగ్రెస్ నాయకులను బూతులు తిడుతూ వాయిస్ మెసేజ్ పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్న సాయిలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

అన్ని వర్గాలకు సంక్షేమం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ యాదగిరి

రేగోడ్(మెదక్): అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తామని జెడ్పీటీసీ యాదగిరి అన్నారు. మండలంలోని రేగోడ్, మర్పల్లి, పెద్దతండా, సంగమేశ్వర తండాల్లో శనివారం ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు అవుతాయని చెప్పారు. కార్యక్రమంలోఎంపీపీ సరోజన, మండల ప్రత్యేక అధికారి నర్సింహరావు, కోఆప్షన్ సభ్యుడు చోటుమియా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధాకిషన్, డైరెక్టర్ నాగేందర్‌రావ్ కులకర్ణి, తహసీల్దార్ బాలలక్ష్మి, ఎంపీడీఓ సీతారావమ్మ, మాజీ సర్పంచ్ విజయ భాస్కర్, మాజీ ఎంపీటీసీ ఎం.నరేందర్, ఎంపీటీసీ నర్సింలు, పార్టీ గ్రామాధ్యక్షుడు శంకరప్ప, ప్రభాకర్, రామాగౌడ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకే ప్రజాపాలన

ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి



రామాయంపేట(మెదక్): దరఖాస్తు ఫారం తీసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీల అమలు కోసమే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం మాసాయిపేటలో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన హాజరై, మాట్లాడుతూ.. అర్హులైన వారి నుంచి అధికారులే నేరుగా దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు దానంపల్లి, రామోజిపల్లి, సంగారెడ్డిపేట, జూకల్ తదితర గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రాణమ్మ, మంజుల, జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాసాడ రాజు, నాయకులు నారాగౌడ్, శ్రీశైలం ఉన్నారు.

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో గుల్పర్తి, మండలంలోని కాట్రియాల, దంతేపల్లి గ్రామల్లో ప్రజాపాలన ప్రశాంతంగా కొనసాగింది. శనివారం ఈ సందర్భంగా పట్టణంలో అధికారులు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఐదు పథకాలు నిరుపేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కాట్రియాల, దంతేపల్లిలో తహసీల్దార్ రజనీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్, తిప్పన్నగుల్ల, రాంపూర్, నందగోకుల్ గ్రామాల్లో ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి గోవింద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధరాములు, జెడ్పీటీసీ విజయ్ కుమార్, ఎంపీడీఓ జగదీశ్వర్‌చారి, తహసీల్దార్ సురేశ్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు అమరేసేనారెడ్డి, చంద్రవర్ధిని, రజిత, బాలనర్సవ్వ, ఎంపీటీసీలు రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



వెల్దుర్తి(తూప్రాన్): దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలిస్తున్న ఆవుల రాజిరెడ్డి



చిన్నశంకరంపేట(మెదక్): శాలిపేటలో ప్రజాపాలన గ్రామసభలో ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో 18 కౌంటర్లతో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరీం, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ సుజాత, పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశంగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ సభ్యుడు యాదగిరియాదవ్ పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సక్రమంగా సాగుతుందని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చండూర్, గౌతాపూర్, గుజిరితండా, గన్యాతండాల్లో ప్రజాపాలన నిర్వహించామన్నారు. దరఖాస్తుల స్వీకరణను ఎంపీపీ వినోదరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశిప్రభ, ఎఎస్ఓ వెంకటేశ్, సర్పంచ్‌లు రాకేశ్, స్వరూప, శంకర్‌నాయక్‌లు, కార్యదర్శులు జితేందర్, దుర్గ, నిర్మల, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణ తెలిపారు. శనివారం టేక్మాల్, మల్కాపూర్‌లో జరిగిన ప్రజాపాలనలో ఆయన మాట్లాడారు. ఇందులో ఎంపీపీ చింత స్వప్నరవి, సర్పంచ్ సుప్రజా, ఎంపీటీసీ నిమ్మ వాణి రమేశ్ తదితరులు ఉన్నారు.

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని మాందాపూర్ గ్రామంలో ఎంపీడీఓ శంకర్ ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి దరఖాస్తులు తీసుకున్నారు.

ప్రజాపాలన గ్రామసభ పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజాపాలన గ్రామసభను మెదక్ ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్ పరిశీలించారు. మండలంలోని శాలిపేట గ్రామంలో ప్రజాపాలన గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ప్రజాపాలన దరఖాస్తులను తీసుకుంటున్న తీరును ఆర్డీఓ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ మహేందర్‌గౌడ్, ఆర్ఐ చంద్రశేఖర్ ఉన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



నాయకులతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): బీఆర్ఎస్ కార్యకర్తలెవరు అధైర్యపడొద్దని మాజీ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. శనివారం మండలంలోని కాళ్లకల్‌కు వచ్చిన సందర్భంగా ఆయన మండల బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతూ... అంతకు ముందు బంగారమ్మ దేవాలయంలో కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేశ్, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాజు, నాయకులు ఇర్ఫాన్, చంద్రయ్య, దుర్గేశ్, బాలేశ్, పీయూష్ పాల్గొన్నారు.

సూరారం పాఠశాలలో మద్యం బాటిళ్లు ధ్వంసం



పాఠశాల ఆవరణలో పగుల కొట్టిన మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న పోలీస్‌లు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం జెడ్పీపాఠశాల ఆవరణలోని పాఠశాల గదుల్లో గుర్తు తెలియని వ్యక్తులు తరుచూ మద్యం సేవిస్తూ ఖాళీ బాటిళ్లను ధ్వంసం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి కూడా పాఠశాల వారండపై మద్యం సేవించిన వ్యక్తులు ఖాళీ బాటిళ్లను పగుల కొట్టారు. దీంతో ఉపాధ్యాయులు గ్రామ కార్యదర్శి నాంపల్లి, సర్పంచ్ నీరజపవన్‌గౌడ్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన స్థలానికి చేరుకొన్న పోలీస్‌లు ఇక ముందు ఎవరైన పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను పట్టుకొని కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.

వైభవంగా మల్లికార్జునస్వామి ఉత్సవాలు ప్రారంభం

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం అత్యంత పురాతనమైన ప్రసిద్ధి గాంచిన దేవాలయంగా చరిత్ర కలిగి ఉన్న దేవాలయంలోని స్వామి వారు భక్తులు కోరిన కోర్కెలను తీరుస్తాడని ఎంతోమంది భక్తుల విశ్వాసం. జాతరలో భాగంగా ఆదివారం స్వామివారికి అభిషేకం, అర్చన, బోనాలు, శివసత్తుల విన్యాసాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

హద్దు మీరితే కఠిన చర్యలు

రేగోడ్(మెదక్): ఈనెల 31 రాత్రి ఎవరైనా తాగి హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజయ్య హెచ్చరించారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

నూతనసంవత్సర వేడుకలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులు శనివారం నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు నృత్యాలు చేశారు. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ లింగమూర్తి, ప్రిన్సిపాల్ వివేకవర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఇరుముడి

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ దేవాలయంలో శనివారం ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మల్లేశ్, గురుస్వామి ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, అయ్యప్ప మాలధారులు ఇరుముడి ధరించి శబరిమలకు బయలు దేరారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, మాజీ ఉప సర్పంచ్ కాశీదాస్, కుమ్మరి నాగరాజు, తదితరులున్నారు.

ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేయాలి

నర్సాపూర్ రూరల్: ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేయాలని మండలంలోని తునికిలోని రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శిక్షణ విద్యార్థులు రైతులకు సూచించారు. శనివారం మండలంలోని మూసాపేటలో వ్యవసాయ శిక్షణ విద్యార్థులు క్షేత్రస్థాయిలో అవగాహన నిర్వహించారు. మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి మూసాపేటలో సర్వే చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మ్యాపు ఏర్పాటు చేసి సాగు, యజమాన్య పద్ధతులపై రైతులకు, గ్రామస్తులకు వివరించారు. పంటలు సాగు చేసే ముందు మట్టి నమూనాలను పరీక్ష చేసి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. తరచూ పంట మార్పిడి చేస్తూ, సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఉదయ్ కుమార్, సర్పంచ్ లావణ్య రవి, రైతులు, వ్యవసాయ శిక్షణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **యువత క్రీడల్లో రాణించాలి**



చిలప్‌చెడ్(నర్సాపూర్): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ మండల కార్యదర్శి సుధాకర్ అన్నారు. మండలంలోని సోమక్కపేట్ గ్రామ యువకులకు ఆయన శుక్రవారం రాత్రి వాలీబాల్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైదానాల్లో క్రీడలు ఆడడంతోనే శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. నేటి యువత ఎక్కువగా మొబైల్స్ కాలం గడుపుతూ అనారోగ్యాలకు, మానసిక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు నాగరాజు, నవీన్, శివాజీ, ప్రభాకర్, వంశీ, గణేశ్, మల్లేశం పాల్గొన్నారు.

◆ **ఐదేళ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదు**

చేగుంట(తూప్రాన్): బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. శనివారం రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శ్రీకాంత్ కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్రంలోని లక్షల మందికి రేషన్ కార్డులు ఇవ్వకుండా ఐదేళ్లు కాలయాపన చేసిందని పేర్కొన్నారు.

◆ **సామర్థ్యాలను పెంపొందేలా బోధన**

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా విద్యాబోధన ఉండాలని మండల విద్యాధికారి నీలకంఠం అన్నారు. శనివారం పైతర ప్రాథమిక పాఠశాలను విద్యాధికారి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరైన చూడాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించేలా చూడాలని అక్కడి మధ్యాహ్న భోజన సిబ్బందిని ఆదేశించారు.

◆ **చాకరిమెట్లలో భక్తజన సందడి**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో నివాసంలో భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.



పీర్లగుట్టపై ఉర్సు ప్రారంభం



దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలోని పీర్ల గుట్టపై వెలసిన హజ్రత్ సయ్యద్ అహ్మద్ షా హుస్సేనీ సంబుల్ షాహిద్ దర్గా ఉత్సవాలు శనివారం గంధం ఊరేగింపుతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కలిసి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నహీం, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి, శేఖర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

కౌడిపల్లి(నర్సాపూర్): మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని మండలంలోని కూకుట్లపల్లి గ్రామ యువత, నిరుద్యోగులు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డికి వినతి పత్రం అందజేశారు. శనివారం గ్రామంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఎమ్మెల్యే హాజరయ్యారు.ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ.. జిల్లాలను సిరిసిల్లా జోన్‌లో కలపడంతో తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చార్మినార్ జోనల్‌లో కలపాలన్నారు. అనంతనంర ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే కచ్చితంగా చార్మినార్ జోన్‌లోకి మార్పుచేసేదని ఈ విషయం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, డీఈఓ రాధాకిషన్, తదితరులు పాల్గొన్నారు. దీంతో పాటు కొట్టాల ప్రజాపాలనలో సైతం యువకులు జిల్లాను చార్మినార్‌జోన్‌లో కలపాలని వినతి పత్రం ఇచ్చారు.

ఘనంగా మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాలు



ఆలయంలో అభిషేకం చేస్తున్న పీఠాధిపతి మాధవానంద సరస్వతీ

నర్సాపూర్: పట్టణంలోని శ్రీ కేతకి భ్రమరాంభ సమేత శ్రీమరకత మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాలను రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ప్రారంభించారు. శనివారం ఈ సందర్భంగా ఆయన భగవంతుడికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకుడు హరిప్రసాద్‌శర్మ పూజలు చేశారు. పూజల్లో యాదవసంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో వెలిసిన మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఉదయం ఊరేగింపుగా గంగాస్థలికి వెళ్లిన భక్తులు అక్కడి నుంచి గంగా నీటిని స్వామివారి సన్నిధి తీసుకొవచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహించారు.

కొనసాగుతున్న బొడ్రాయి ఉత్సవాలు



పూజల్లో కాంగ్రెస్ నేతలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో గ్రామ దేవతల పూజా మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా శనివారం కట్ట మైసమ్మకు అర్చకుడు బాబురావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, బోనాలు సమర్పించారు. ఆదివారం ఊరడమ్మకు, గావురంగం, పొలిమెర పొత్తి నిర్వహణతో ఉత్సవాలు ముగుస్తాయని సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనంతో చెరువు కట్ట పరిసరాలు నిండిపోయాయి. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నిర్వాహకులు, గ్రామ పెద్దలు, తదితరులు ఉన్నారు.

పూజల్లో కాంగ్రెస్ నేతలు

గ్రామాల్లో నిర్వహిస్తున్న బొడ్రాయి పూజల్లో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ ఇన్‌చార్జి రాజిరెడ్డితో పాటు సీనియర్ నాయకులు కర్ణాకర్‌రెడ్డి, లక్ష్మీకాంతారావు, సుదర్శన్‌గౌడ్, నవీన్ గుప్తా, వెంకటేష్, రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నరేశ్, నాగభూషణం, గణేశ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వీరిని సన్మానించారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని పొడిచన్‌పల్లిలో శనివారం అయోధ్య రాముడి అక్షింతలను ఊరేగించారు. మెదక్ నుంచి అక్షింతలు రాగానే ఊరేగింపుగా హనుమాన్ ఆలయం వద్దకు వెళ్లి అక్కడ ఉంచి, అనంతరం పంపిణీ చేశారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటకు శనివారం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ మందిరం అక్షింతలు శివ్వంపేటకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు శివ్వంపేటలోని బగలాముఖీ శక్తిపీఠంలో పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని 37 గ్రామ పంచాయతీలకు అయోధ్య రామ మందిర అక్షింతలు, భవ్య మందిర ఫొటో, ఆలయ విశిష్ట గురించి కరపత్రాలు అందించామని ట్రస్ట్ ప్రతినిధులు ఓంకార్, కుమ్మరి అశోక్, శివకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

చేగుంట(తూప్రాన్): చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. శనివారం చేగుంట ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన శంభుని లింగమ్మ(75) భర్త కొమురయ్య 20 రోజుల క్రితం మృతి చెందాడు. భర్త మృతితో మనస్తాపం చెంది ఈనెల 28వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. దీంతో లింగమ్మను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నశంకరంపేట(మెదక్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. శనివారం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం నర్సంపల్లికి చెందిన బొమ్మగారి సుభాష్(35) ఈనెల 28న రాత్రి నార్సింగి నుంచి నర్సంపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. బైక్ అదుపుతప్పి పడిపోగా తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

- మున్సిపల్ చైర్మన్ ఆరోపణలు అవాస్తవం
- కాంగ్రెస్ కౌన్సిలర్లు

తూప్రాన్: కాంగ్రెస్ ప్రభుత్వంపై మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ కౌన్సిలర్లు భగవన్‌రెడ్డి, జ్యోతిలు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ మంజూరు చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని మున్సిపల్ చైర్మన్ పేర్కొనడం అవివేకమన్నారు. ఎన్నికల ముందు ఓట్లు రాబట్టుకోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆఘమేఘాల మీద ప్రోసీడింగ్‌లు జారీ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి నెల కావోస్తుందని అప్పుడే సీఎం రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్ భగవన్‌రెడ్డి, రవీందర్‌గుప్త, పార్టీ సీనియర్ నాయకుడు మహేందర్‌రెడ్డి, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.